కథా నిలయం
3520
శ్రీకాకుళం

# పద్మప్రియ

నా ఆలోచనలు ఆమె చుట్టూ పరిభ్రమించాయి. పేరును బట్టి ఆమె అందాన్ని అంచనా వేసాను. 'పద్మప్రియ'. ముచ్చటైన పేరు. ఎలా వుంటుందామె?

సన్నజాజీ తీగలాగ, బొండుమల్లె చెండులాగ? పేరుకు తగ్గట్టూ ఎర్రగా వుంటుందేమో? రూపం తెలియని ఆ పడతిని గురించి ఆలోచించడం అవివేక మనిపించిందా క్షణంలో. అంతలోనే మళ్ళీ ఆమెకోసం ఆరాటం. ఈ వింత అనుభూతికి ఆ రోజందుకున్న వుత్తరమే కారణం. జేబులోంచి లెటరు తీసి మళ్ళీ దృష్టి సారించాను. పాల మీగడ లాంటి తెల్లటి కాగితం మీద నీలివర్ణంలో అక్షరాలు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

"రవిగారూ! ఏం చేస్తున్నట్లు....? అదేం ప్రశ్న.... నా ఉత్తరం చదూతున్నారు... ఔనా....? అరే, అలా అయిపోయారేం? ఇంత చనువు తీసుకుని వ్రాస్తున్న ఈ అపరిచితురాలు ఎవరై వుంటారనా....? కంగారు పడకండి. నాపేరు పద్మప్రియ, సింపుల్‌గా "ప్రియా!" అని పిలవవచ్చు. అదిగో అవే.... ఆ ఆకర్షణ వుట్టి పడే ఆ కళ్లే నన్నిలా వ్రాయమని ప్రోత్సహిస్తున్నాయి. పెళ్ళి కాని ఈ పడుచును గూర్చి తెలుసుకోవాలని వుందా...? ఆహా.... ఇప్పుడప్పుడే వద్దు వివరంగా మళ్లీ వుత్తరం వ్రాస్తాను. అంతవరకు హాయిగా నిద్రపోండి.

ఇట్లు
మీ
ప్రియ

ప్రియ. పెళ్లికాని పడతి. పైపెచ్చు బాగా తెలుసునంటోంది. ఎవరబ్బా?

లెటరు సొంతం పదిహేను సార్లు చదివాను. ఇండియాలో ఇస్పెషల్లీ ఆంధ్రదేశంలో ఆన్ మారీడ్ వుమన్‌కు ఇంత తెగవా? అంత ధైర్యంగా ఒక ఆడది మగవాడికి ఉత్తరం వ్రాయగా లేంది చిరునామా తెలియపరిస్తే వచ్చిన అభ్యంతర మేమిటో? కోరికలు తీరని కొందరతివలు మగవాళ్లకిలా వుత్తరాలు వ్రాసి ఆనందానుభూతులు పొంది పరవశించి పోతూ వుంటారని అంటారు అలాంటి బాణీయా? ఛ.... అలా అనుకో బుద్ధి కావడం లేదు. ఉత్తరంలోని ప్రతి అక్షరంలో ఆమె హృదయం ప్రతిబింబిస్తోంది. ఆలోచన అక్కడితో స్వస్తి చెప్పి నిద్ర కుపక్రమించాను.

మేనేజరు డిక్టేట్ చేసిన బిజినెస్ లెటర్ టైపు చేసి ప్యూన్ని పిలిచాను.

"సార్" ఫైలు పట్టుకెళ్తూ బల్లమీద ఒక కవరుంచాడు అటెండరు.

కవరు మీద ఎడంవైపు "పద్మప్రియ" అన్న అక్షరాలు ఆకాశంలోని తారల్లా మెరుస్తున్నాయి. ఇంటి నెంబరుగాని, స్ట్రీట్ పేరుగాని, వ్రాసిలేదు. ఆదుర్దాగా కవరుచించి చదివాను. ఈమారు ఆమె వుత్తరం మగవాడిని కైపెక్కించేలా వుంది సెక్సు సాహిత్యాన్ని అందమైన పదజాలంతో అతినేర్పుగా కాగితం మీద గుప్పించింది. చదూతున్నంతసేపూ ఆహ్లాదంగా మనసును రంజింపజేసిందేగాని ఎక్కడా ఎబ్బెట్టుగా లేదు. చెమటలుపట్టిన ముఖాన్ని హేండ్ కర్చీఫ్‌తో వత్తుకున్నాను. లోపల మేనేజరు కాల్ ఇవ్వడంతో మళ్ళీ ఆఫీసు పనిలో లీనమయ్యాను.

ఆ రోజంతా ఆమెను గూర్చే ఆలోచించాను. ఎవరీ పద్మప్రియ? నేనంటే ఆమెకెందుకంత మోజు? ప్రేమించిన అమ్మాయిని చేరువవడంకంటే మించిన అదృష్టం మరొకటుంటుందా? నా భావసుందరెలా వుంటుంది? రంభ, ఊర్వశిలాంటి దేవకాంతలతో పోల్చుకున్నాను. మళ్ళీ ఈ లోకంలోకొచ్చి అందాలరాణులుగా చలామణీ అవుతున్న సినీస్టార్స్‌తో కంపేర్ చేసాను. ఎంత వూహించినా ఒక స్థిరమైన రూపం నా యెదలో ఏర్పడటం లేదు. ఏదేమైనా ఆమె సౌందర్యవతి. అందులో ఏ మాత్రం సందేహం లేదు.

ఆనాటి నుండి ప్రతి రెండురోజులకి ఒక ఉత్తరం రాసాగింది. ఒక్కోమూడ్‌లో జవాబిద్దామని పెన్ను తెరిచేవాణ్ణి. ఐతే వ్రాసి ఎక్కడకు పంపను? ఆమె వంపులు, సొంపులు, వివిధ కోణాల్లో వూహించుకోవడం తప్పా మరేంచేసేది? నన్నింతగా ప్రేమిస్తున్న ఆ అందాలతార ఏదో ఒకరోజు దర్శనమివ్వకపోతుందా? మొత్తంమీద నాకు తెలియకుండానే ప్రేమపిచ్చిలో పడి పోయాను. ఆ అందాల అపరంజిబొమ్మను నిశ్శబ్దంలో అన్వేషించాను. నా మూమెంట్స్ కొలీగ్స్ కనిపెట్టేసారు. పనిలో

పరధ్యానం కొట్టొచ్చినట్లు కానొస్తోంది. విషయం వివరించమని వేధించారు.

పద్మప్రియ నుండి ఫ్రెష్‌గా వచ్చిన ఉత్తరాన్ని మరోమారు ముద్దు పెట్టుకుని చదివాను.

"మిమ్మల్ని మరింక వేధించ దలచుకో లేదు. ఇప్పటికే మీరు బాగా విసిగిపోయి ఉంటారు.... ఔనా. ఈరోజే మన కలయికకు నాంది. ప్రేమకు పునాది. సరిగ్గా సాయంత్రం ఆరు గంటలకల్లా మీకోసం పబ్లిక్ గార్డెన్‌లో ఎదురు చూస్తూ ఉంటానని మరచిపోకండి. మిస్ చెయ్యరు కదూ! మిమ్మల్ని ఆట ఆడించడానికి ఇది మరో నాటకమని భావించవద్దు."

ఇట్లు మీ ప్రియ

సాయంత్రం ఆరవటానికింకా నాలుగు గంటలు వ్యవధి వుంది. నా ఆరాధ్య దేవతను సందర్శించుకునే సమయ మాసన్నమైంది. ఆనందం అంచులు దాటింది. హృదయం గాలిలో దూదిపింజలా తేలిపోతోంది. ఈ నిరీక్షణలో ఒక్కోక్షణం ఒక్కో యుగంలా భారంగా గడవసాగింది.

ఆఫీసు పనియైయిందనిపించి ఆరు కాకుండానే పార్కులో కడుగు బెట్టాను. ఆ రోజు ఎందుచేతో అట్టే జనంలేరు. అక్కడక్కడా కొన్ని జంటలు కూర్చుని ఏవేవో ముచ్చటించుకుంటున్నాయి. మాటలు కందనివారి ఆనందంలో భాగం పంచుకోవాలని కాబోలు పక్షులు కిల కిల మంటూ అల్లరి చేస్తున్నాయి.

గుబురుగా పెరిగిన ఓ పూలపొద చాటున ఎవరో ఒక యువతి నిరీక్షణ కంటబడింది. అమితానందంలో పుక్కిరి బిక్కిరయ్యానోమారు. ప్రేమను ముందు పరచి ఎదురు చూస్తున్న ఆ అపరిచిత యువతితో సంభాషణెలా ప్రారంభించాలో అర్థం అవటంలేదు. ఎలాగైనా ఆమె వడిలో వదిగిపోవాలనే ఆరాటంతో పరుగులంఘించాను. చేరువైన ఆ వనితను కాంచాకా నా ఉత్సాహం నీళ్ళుకారిపోయింది. ఆనందమంతా ఆరులోకాలకడుగుకు కూరుకుపోయింది. నా అందాలరాశి, కలలదేవత నా వూహాకు వ్యతిరేకమైంది. నా ఆలోచనలు, అంచనాలు, పూర్తిగా భిన్నమయ్యాయి. నా దృష్టికామె రంభలా కాదుకదా కనీసం సినిమాస్టారులా స్టయిలుగా కూడా లేదు. ఒక సామాన్యమైన స్త్రీ అంతకంటే ఏం చెప్పను? వెనక్కు తిరిగి వెళ్లిపోదామనుకుంటే సభ్యత, సంస్కారం అడ్డువచ్చాయి.

తడబడుతున్న పెదాలతో "మీరు"! అనే లోపలే "ప్రియా" అని జవాబిచ్చింది.

"అది పేరా? సంబోధనా?"

"కూర్చోండి" కన్నులతోనే ఆమె ఆహ్వానం

ఆ కళ్ళల్లో నేనూహించిన ఆకర్షణ లేదు.

బొమ్మలా చతికిలబడ్డాను.

"మీరు అనుకున్నంత అందంగా లేనుకదూ?" శూన్యంలోకి చూస్తూ అందామె.

ఆ ప్రశ్నకు ఏం సమాధానమివ్వాలో స్ఫురించక మౌనం వహించాను.

చెప్పడం ఆమెవంతైతే, వినడం నా వంతైంది.

"ఇదివరలో నన్ను మీరెప్పుడూ చూసివుండరు"

ఆమె మాటలు నా కర్ణభేరిని తాకటంలేదు.

"మీరు బోరు ఫీలవనంటే నాలుగు ముక్కలు చెబుతాను."

"ఫరవాలేదు చెప్పండి" పరధ్యానం నుండి తేరుకుని అనగలిగాను.

"నా పేరు పద్మప్రియ అని మీకు బాగా తెలుసు. కాస్తో కూస్తో చదువు సంస్కారం గల పడతినని మీరీపాటికి గ్రహించేవుంటారు. నా జీవితం మూడు పువ్వులూ ఆరు కాయల్లా విలసిల్లాలని భావించిన నా తల్లిదండ్రులకు నేనొక సమస్య ఐపోయాను. ఈ సమస్యకు పరిష్కారం చూపగల శక్తి ఈనాటి మగవాడిలో మృగ్యమైంది."

మీరు చెప్పదలచుకున్నదేదో సూటిగా చెప్పండి" అన్నాను కాస్త చిరాగ్గా. ఆమె తిరిగి తనకథ చెప్పడం ప్రారంభించింది.

"కాలేజీలో చదూకునే రోజుల్లో ఒక మగపురుగు నన్నదేపనిగా వెంబడించి, వలపుబాణాలు ప్రయోగించి వశపరచుకుంది. 'మగపురుగు' అన్నందుకు మీరు హర్టవకండి."

"అతడితో కలసి సినిమాలకని, షికార్లకని తిరిగేదాన్ని. అతడెవరో, ఏం చేస్తూ వుంటాడో తెలుసుకోడానికి నేనెప్పుడూ ప్రయత్నించలేదు. ఎన్నోమార్లు మైకంలో ముంచెత్తి వశపరచుకోవాలని తలచాడు. పెళ్ళికాకుండానే తనువతనికి సమర్పించకూడదన్న నా నిర్ణయమతనిని కలవరపెట్టేది. అతనికి నాపై వాంఛతప్ప మనసులేదని కాస్త ఆలస్యంగా తెలుసుకున్నాను. నాకు కనువిప్పైంది. పెళ్ళికంటె ముందు పొందుకోసం తాపత్రయపడి పరాజయం పొందాడు. అతని నైజాన్ని గుర్తించాకా సంబంధం త్రెంచుకోవడం మంచిదని భావించాను. కాని అతడు నాపై కక్ష పెంచుకున్నాడు. మామధ్య నడచిన ప్రేమ లేఖలతో నాటకమాడి నాకు మరే

సంబంధం కుదరకుండా అడ్డుపడ్డాడు. అటువంటి వ్యక్తిని నేనెలా సంబోధించాలో మీరే చెప్పండి. ఐతే ఈ కథ అక్కడితో ఆగలేదు..."

"తీసుకొచ్చిన ప్రతి సంబంధం ఇలా తప్పి పోవడంతో మావాళ్ళకు దిగులు పట్టుకుంది. చివరకు నన్ను మరో వూరు తీసుకుపోయి సంబంధమొకటి ఖాయపర్చారు. ఐతే ఎలా తెలుసుకున్నారో ఏమిటో ముహూర్త సమయానికి పిడుగులా వచ్చి నానారభస చేసాడు. దాంతో పెళ్ళి వారికి నాశీలం మీదే అనుమానం కలిగి వెళ్ళిపోయారు. నేను వ్రాసిన ఉత్తరాలు అతనికి బ్రహ్మాస్త్రంలా పనిచేసాయి."

"అతనికి నేనేం అపకారం చేసాను? నన్నెందుకలా వెంటాడుతున్నాడు? పీటలమీద పెళ్ళి తప్పిపోతే ఆడదానికి మళ్ళీ పెళ్ళికాదు. అందుకే మావాళ్ళు వాడి కాళ్ళావేళ్ళాబడి బ్రతిమాలారు. ఎలాయైతేనేం పెళ్ళిచేసుకోడాని కంగీకరించాడు. నాకు జరుగుతున్న అన్యాయానికి అతడి హృదయం కరిగిందనుకున్నాను. మనిషిగా మారాడని తలిచాను. అతడిచేత తాళి కట్టించుకోడానికి సిద్ధపడ్డాను. తాళైతే కట్టేడుగాని ఆ తర్వాత ఏం చేసాడో చెబితే మీరాశ్చర్యపోతారు... ఒక క్షణం చెప్పటం ఆపి పమిటి చెంగుతో కళ్ళొత్తుకుంటూ నా నయనాల్లోకి దీనంగా చూసిందామె.

ఆమె కథ నాలో ఇప్పుడు ఆసక్తిని రేపింది. "ఏం చేసాడు?" అన్నాను యాంత్రికంగా.

మనసున్న మనుషులెవరూ చేయలేని పని. "నీ మెడలో పసుపుతాడు కట్టింది నీతో కాపురం చేయటానికి కాదు నా పగ తీర్చుకోవటానికి. మళ్ళీ ఏ మగవాడు నిన్ను చేరదీయకుండా వుండటానికి. నీ యవ్వనం అడవిగాచిన వెన్నెలై పోవాలి" అంటూ నన్ననుభవించి పరారయ్యాడు.

"అతడి మనసు మారకపోతుందా మళ్ళీనాకు చేరువవక పోతాడా అని గత ఐదారేండ్లుగా ఎదురుచూసాను."

"ఈమధ్య పేపర్లో వెలువడ్డ వార్తచూసాక ఈ నిరీక్షణలో ప్రయోజనం లేదని తేలిపోయింది. అతడికి, తన గేంగుతో దోపిడీలు, హత్యలు చేసాడన్న నేరారోపణపై యావజ్జీవ కారాగార శిక్ష విధింపబడింది. ఇప్పుడు చెప్పండి. నేను పెళ్ళి కాని పడచునా. మూడు ముళ్ళూ వేయించుకున్న ముత్తయిదునా? నన్నేమంటుందీ లోకం?" నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నించిందామె.

ఆమె తీక్షణమైన కళ్ళల్లోకి చూసే శక్తి లేక దృష్టి మరల్చాను. నా నుండి ఏ సమాధానం రాకపోవడంతో మళ్ళీ ఆమే అన్నది-

"రవిగారూ! నా చరిత్రంతా దాచకుండా మీ ముందుంచాను. ఈ రోజు కోసం ఎన్నో రోజులబట్టి ఎదురు చూసాను. నా హృదయం ఇప్పుడెంతో తేలికగా వుంది. నా అంతరాంతరాలలో నిక్షిప్తమైన ఆవేదన హృదయం వున్న ఒక వ్యక్తికి చెప్పుకున్నానే తృప్తి మిగిలింది. నన్ను మీరెలా అర్థం చేసుకున్నా సానుభూతితో నా కథంతా విన్నందుకు మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీటంలేదు."

ఆమె కథ విన్నాకా ఆమె ఆత్మ సౌందర్యాన్ని పరిశీలించటానికి ప్రయత్నించాను. మాటలలో మూర్తీభవించిన ఆ సంస్కారం, ఆ వ్యక్తిలోని వున్నతమైన ఆ వ్యక్తిత్వం నన్ను ముగ్ధుణ్ణి చేయసాగాయి, ఏదో చెప్పాలనుకునే లోపలే ఆమె అంది-

"గత ఆరు మాసాలుగా మిమ్మల్ని గమనిస్తున్నాను. మీ గంభీరమైన వ్యక్తిత్వం, సత్ప్రవర్తన, విద్యా వినయాలు నన్ను బాగా ఆకర్షించాయి. అందుకే ఈ ధైర్యం చేసాను. చేరువై ప్రేమను పంచ గలిగితే అందుకుంటాను. లేకుంటే దానిని నాలోనే సమాధి చేసుకుని జీవితాంతం మీరూపాన్ని నా శాంతి మందిరంలో పదిలంగా భద్రపరుస్తాను. బాగా ఆలోచించి మీ నిర్ణయం తెలియ చేస్తారని ఆశిస్తున్నాను. ఇదుగో నా చిరునామా" ఏదో ఒక చిన్న కాగితం చేతి కందించి నిష్క్రమించిందామె, ఆ మసక మసక చీకట్లో.

నేను నచ్చే అమ్మాయిని చేసుకునే కంటే, నన్ను మెచ్చుకునే మనసున్న వనితను కట్టుకుంటే సంసారం స్వర్గతుల్య మౌతుందన్న భావన రావడంతోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను.

● ఆదివారం వీక్లీ *5.7.81* ●